క్లుప్తంగా

ఉచిత వైద్య పరీక్షలు



గుడివాడ టౌన్: ది ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక మందపాడులోని నైట్‌షెల్టర్ వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ జగదీశ్వర రావు ఆధ్వర్యంలో 35 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. క్లబ్ సభ్యుడు పెనుమోతు వంశీ సౌజన్యంతో పరీక్షలు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, వైద్య విభాగం చైర్మన్ పాన్నూరు సత్యనారాయణ, పూర్వ అధ్యక్షుడు ఎల్ఈ వెంకటేశ్వరరావు, లింగం చిట్టిబాబు, బి. కుటుంబరావు, కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు వితరణ



గుడివాడ టౌన్: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సేవా కార్యక్రమాలకు రూ.25 వేలు వితరణ అందినట్లు సంస్థ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. స్థానిక టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన సమావేశంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పీవీ శేషగిరిరావు ఈ మొత్తాన్ని అందజేశారన్నారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు గుత్తా రమేష్, కార్యదర్శి బి.సరస్వతి, వైస్ చైర్మన్ పి వేణు గోపాలరావు, కోశాధికారి గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శం



ముదినేపల్లి రూరల్: ఏసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు సీఎస్ఐ చర్చి మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన నూతన మందిర ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఏసు ప్రభువు కృప అందరిపై ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యులు దాసరి చిరంజీవి, రంగిశెట్టి నరసింహారావు, బేతూ రాజ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

కైకలూరు: శ్రావణమాసం సందర్భంగా కైకలూరు వాసవి కన్యకా పరమేశ్వరికి కంతేటి వంశస్తులు శ్రావణమాస సారెను ఆదివారం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు చొప్పర్ల మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 8 వరకు దేవాలయంలో అమ్మవారి 43వ శ్రావణ మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబరు 1న మహాలక్ష్మి వ్రతం, 8న సామూహిక కుంకుమార్చన జరుపుతామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొప్పర్తి గోపాలకృష్ణమూర్తి, ఎస్‌వీఎస్ఎస్ బస వరాజు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

నాగాయలంక: రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ. సంజీవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 18,500 ఎకరాలు కాగా ఇప్పటివరకు 4,150 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని చెప్పారు. సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 1500 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. ఇప్పటికే నాట్లు పూర్తి చేసిన వారు, నాట్లు వేయాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి తమ పంట వివరాలను ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

హోమియో మందుల పంపిణీ



మచిలీపట్నంటౌన్: వైజ్‌మెన్ క్లబ్, అజ్మీర్ బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సర్కారుతోటలోని వాసవీ వృద్ధాశ్రమంలో కళ్ల కలక నివారణ హోమియో మందులను వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌మీర్ పర్యవేక్షణలో పంపిణీ చేశారు. సయ్యద్ బాజీ, హోమియో వైద్యులు ఎస్. ప్రభాకరరావు, ఎ. శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. కళ్లకలక సోకిన వారు కళ్లద్దాలను పెట్టుకోవాలని సూచించారు.

ఆరోగ్య సేవలు అద్భుతం

- కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా పామర్రు పీహెచ్‌సీ
- 105 గ్రామాల ప్రజలకు ఉపయోగం
- వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లక్కర్లేదు



పామర్రులో సీహెచ్‌సీగా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పామర్రు: ప్రజలకు అద్భుతమైన ఆరోగ్య సేవలు అందించడానికి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పామర్రులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా మార్పు చేసి ఉత్తమ మైన వైద్య సేవలను అందిస్తోంది. నియోజకవర్గంలోని 2.20 లక్షల మంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చెంతకు చేర్చారు.

చెంతనే కార్పొరేట్ వైద్యం

గతంలో పెద్ద వైద్యం చేయించుకోవాలంటే విజయవాడ, గుంటూరు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. పామర్రులో సీహెచ్‌సీ ఏర్పడటంతో పెద్ద సర్జరీలు ఇక్కడే నిర్వహిస్తున్నారు. దీనితో ప్రజలకు మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భవన నిర్మాణాలకు చర్యలు

పీహెచ్‌సీ ప్రాంగణంలోనే ప్రస్తుతం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. రోజుకు సుమారు 130 మందికి పైగా ఓపీకి వస్తున్నారు. సీహెచ్‌సీ కోసం ప్రస్తుతం ఉన్న భవనాలకు అదనంగా పీహెచ్‌సీ ప్రాంగణంలో 15 సెంట్ల స్థలంలో కొత్తగా భవనాల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న భవనాల్లోనే సీహెచ్‌సీ వైద్యులు సేవలను అందజేస్తున్నారు.

సీహెచ్‌సీతో ఉపయుక్తం

పామర్రు పీహెచ్‌సీ కేంద్రం సీహెచ్‌సీగా మారడంతో ప్రస్తుతం ఉన్న ఆరు పడకల వైద్యశాలను 30 పడకలకు పెంచుతున్నారు. ప్రస్తుతం ఉన్న వైద్య అధికారులు సిబ్బందితోపాటు మరొక 38 మంది వైద్యులను నియమించారు. వీరి పర్యవేక్షణలో కమ్యూనిటీ హెల్త్ కేంద్రం నిర్వహిస్తున్నారు. సీహెచ్‌సీ నిర్మాణానికి ప్రభుత్వం మొత్తం రూ.8.18 కోట్లతో వ్యయ అంచనా వేసింది.

ప్రత్యేకంగా నియమించిన వైద్యులు వీరే

కొత్తగా ఏర్పాటు చేసిన సీహెచ్‌సీలో స్పెషలిస్టులైన వైద్యులను నియమించారు. స్పెషలిస్టులు సివిల్ అసిస్టెంట్ సర్జన్, గైనకాలజిష్టు, ఎనస్తీషియా, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్, సర్జన్ జనరల్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్‌లు సీహెచ్‌సీలో నియమించి మెరుగైన సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారు. నియోజకవర్గప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి పామర్రు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కోరారు. ఆయన వెంటనే మంజూరు చేయడం, గవర్నమెంట్ ఉత్తర్వులు జారీ చేయటమే కాకుండా సీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని నియమించారు. ఇది నియోజకవర్గ ప్రజలకు ఎంతో శుభపరిణామం. వీటిని ప్రజలు వినియోగించుకుని మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారు.

సీఎంకు ధన్యవాదాలు



నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ సీహెచ్‌సీ ఏర్పాటు. దీన్ని ఏర్పాటు చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే మంజూరు చేశారు. వైద్య నిపుణులను నియమించారు. ఆయనకు ధన్యవాదాలు. రూ.8.18 కోట్ల వ్యయ అంచనాతో త్వరలో సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు జరుగుతాయి.

–కైలే అనిల్‌కుమార్, పామర్రు ఎమ్మెల్యే

ప్రజలకు ఎంతో ఉపయోగం



నియోజకవర్గంలోని 105 గ్రామాల ప్రజలకే కాకుండా పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు కూడా ఉత్తమమైన మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం వైద్యశాలలో ఓపీ బాగా పెరిగింది. నిష్ణాతులైన వైద్యుల పర్యవేక్షణలో ఆపరేషన్లు ఇక్కడే చేస్తున్నాం. ప్రజలు వీటిని వినియోగించుకోవాలని వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు.

–సుధారాణి, పామర్రు సీహెచ్‌సీ వైద్యురాలు

పొదుగు వాపుపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ ఎంఎస్‌పి దివాకర్

గుడివాడ టౌన్: వానాకాలంలో ఆవులు, గేదెల్లో పొదుగు వాపు వ్యాధి సోకే అవకాశాలు ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదివారం కృష్ణాజిల్లా పశువైద్యశాఖ అధికారి డాక్టర్ ఎంఎస్‌పి దివాకర్ సూచించారు. ఈ వ్యాధి స్ట్రెప్టోకోకస్, స్టెఫైలోకోకస్ అనే బ్యాక్టీరియా ద్వారా కలుగుతుందన్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో పశువులను ఉంచడంతో ఈ వ్యాధి సోకడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నయని అన్నారు. వ్యాధి పొదుగు, రొమ్ముల్లో వస్తుందని పాలు పితికినప్పుడు పాలల్లో గడ్డలు ఉండటం, వ్యాధి ముదిరినప్పుడు పాలతో పాటు రక్తచారలు స్రవించడం, పొదుగు విపరీతమైన నొప్పి ఉండటం వలన పాలు పితికేటప్పుడు పశువు సహకరించకపోవడం, పాల దిగుబడి తగ్గడం వంటివి ఈ వ్యాధి లక్షణాలుగా గుర్తించవచ్చన్నారు. రొమ్ముల్లో పాలను పూర్తిగా పితికిన తర్వాత పెండిస్ట్రెప్ ఎస్‌హెచ్ మందును లేదా మమ్మిట్రాల్ మందును 5 గ్రాముల చొప్పున వ్యాధి సోకిన రొమ్ముకు ఎక్కించాలని అన్నారు. పరిశుభ్ర వాతావరణంలో పశువులను ఉంచాలన్నారు.

ఇస్రో శాస్త్రవేత్త తల్లిదండ్రులకు సత్కారం



శాస్త్రవేత్త చైతన్య తల్లిదండ్రులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల బాధ్యులు

ఉయ్యూరు: చంద్రయాన్-3 విజయంలో కీలక పాత్ర పోషించిన శాస్త్రవేత్తల్లో ఒకరైన మదిర చైతన్య తల్లిదండ్రులను ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల బాధ్యులు ఆదివారం సత్కరించారు. చంద్రయాన్ 3 ప్రయోగంలో ఈ కేటగిరీ విభాగంలో పనిచేసిన మదిర చైతన్య స్వగ్రామం ఉయ్యూరు కావటంతో ఆయన తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు దంపతులను బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో పౌరసన్మానం చేశారు. పట్టణంలోని తోట్లవల్లూరురోడ్డులో వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ, రాజులపాటి చిన్ని, మాజీ జెడ్పీటీసీ రాజులపాటి రామచంద్రరావు, ఏజీఅండ్ఎస్‌జి జూనియర్ కళాశాల డైరెక్టర్ జిజేపి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



బచ్చుపేటలో వ్రతంలో పాల్గొన్న దంపతులు

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని గణపతి సచ్చిదానంద దత్తాశ్రమంలో జయలక్ష్మీ మాత మాతృ మండలి ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అత్రి వరద దత్తాత్రేయ స్వామి వారికి తైలాభిషేకం చేశారు. కార్యక్రమానికి హాజరైన సువాసినిలకు జాకెట్ ముక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. భక్తులకు అన్నసమారాధన చేశారు.

బచ్చుపేట ఆలయంలో..

నగరంలోని బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుద్ధ ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర స్వామి వారి వ్రతం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రవికాంత్, ఈఓ చక్రధరరావు పర్యవేక్షించారు.

మెనోపాజ్‌పై ఆందోళన చెందవద్దు



వైద్యురాలు శిరీషను అభినందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పెనమలూరు: మహిళలకు వచ్చే మెనోపాజ్‌పై ఆందోళన చెందవద్దని నాగార్జున ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ శాఖమూరి లక్ష్మిశిరీష అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం వాకర్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మెనోపాజ్...దీన్ని ఎలా ఎదుర్కోవాలి.. అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాఖమూరి లక్ష్మిశిరీష మాట్లాడుతూ మహిళలు 50–55 సంవత్సరాల వయస్సు వచ్చిన సమయంలో మెనోపాజ్ సమస్య ఎదుర్కొంటారన్నారు. ఈ విషయంలో మహిళలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమయానికి ఆహారం తీసుకోవాని, వ్యాయామం క్రమం తప్పకుండా చేస్తే మెనోసాజ్ సమస్యలు అధిగమించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు రూప్‌కుమార్, కార్యదర్శి సతీష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాంట్రాక్ట్ కూలీకి విద్యుదాఘాతం

ఎమ్మెల్యే చొరవతో ఆస్పత్రికి తరలింపు



కై కలూరు: వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో విద్యుత్ నూతన లైన్ పనులు చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజేష్ పూరి (23) అనే కాంట్రాక్టు కూలీ ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అటుగా వస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు ఈ విషయం తెలిసింది. వెంటనే పరిస్థితిని సమీక్షించి చిన్న కుమారుడు దూలం వీరశ్యామ్ ఫణికుమార్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన వచ్చిన శ్యామ్ క్షతగాత్రుడిని కై కలూరు వరసంజీవిని ఆస్పత్రికి తీసుకువెళ్ళి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఆస్పత్రికి దగ్గరుండి తరలించారు. సకాలంలో స్పందించిన ఎమ్మెల్యే, ఆయన కుమారుడి సేవలను విద్యుత్ కాంట్రాక్టు సిబ్బంది కొనియాడారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

తోట్లవల్లూరు: భార్యను హత్య చేసిన ఘటనలో భర్తను అరెస్టు చేసినట్లు తోట్లవల్లూరు ఎస్ఐ రమేష్ తెలిపారు. మండలంలోని కుమ్మమూరు ఎస్సీ వాడకు చెందిన వీర్ల రమ్యతేజ(32)ను భర్త వీర్ల రామకృష్ణ సెల్‌ఫోన్ చార్జింగ్ వైరుతో గత శనివారం హత్య చేసిన విషయం విదితమే. ఘటనలో నిందితుడు రామకృష్ణను అరెస్టు చేసి ఉయ్యూరు కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

125 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పర్యాటక శాఖ ఫుడ్ కోర్టు భవనంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ప్రారంభించారు. 125 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 105 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి శస్త్రచికిత్సల కోసం రెండు ప్రత్యేక బస్సుల్లో ఆస్పత్రికి పంపించారు. డాక్టర్ హారిక, డాక్టర్ మేఘన వైద్య సేవలు అందించారు. ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి ఎం.రవికుమార్, జమీలా మస్తాన్, కనిగంటి వెంకటనారాయణ, తలశిల లీలామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పూలపాటమ్మ జాతర



పల్లెవాడలో పూలపాటమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కై కలూరు: ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. పామర్రు – దిగమర్రు జాతీయ రహదారిలో పల్లెవాడ గ్రామ మలుపు వద్ద పూలపాటమ్మ జాతరను ఎమ్మెల్యే దంపతులు ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా క్రమం తప్పకుండా జాతర చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, గ్రామ సర్పంచ్ దుట్టా మణి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ పనితీరు భేష్

- ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ
- కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో సబ్‌స్టేషన్ ప్రారంభం



కైకలూరు గ్రీన్ విలేజ్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను చార్జి చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కై కలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు అభినందనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కొనియాడారు. కై కలూరు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఏపీ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో రూ.4.15 కోట్ల నిధులతో 33/11 కేవీ ఏఐఎస్ ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 3 ఫీడర్లు కలిగిన కేంద్రం నుంచి 2 ఫీడర్లు జగనన్న కాలనీ, మరో ఫీడర్ ఆటపాక పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేస్తారన్నారు. కలిదిండి మండలం కాళ్లపాలెం సబ్‌స్టేషన్‌ను మరో 15 రోజుల్లో ప్రారంభిస్తామని చెప్పారు. చినతాడినాడు, కొండంగి, ఇంగిలిపాకలంకల్లో త్వరలో సబ్‌స్టేషన్లను నిర్మిస్తామన్నారు. కొల్లేరు గ్రామాలుపెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం రెండు గ్రామాల్లో ఒక చోట సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నామని తెలిపారు. పూర్తి సహకారం అందిస్తున్న సీఎండీ పద్మాజనార్దనరెడ్డికి, స్థానిక విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులు సమస్యలు వస్తున్నప్పుడు సకాలంలో స్పందిస్తున్నారని కితాబిచ్చారు. గత ప్రభుత్వం కంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కురేళ్ల బేబి, వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బలే నాగరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ మహమ్మద్ జహీర్, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, కై కలూరు పీఏసీఎస్ అధ్యక్షులు పంజా రామారావు, విద్యుత్‌శాఖ గుడివాడ డీఈ టి.రామకృష్ణ, ఏడీ బి.రామయ్య తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ సంబరాలు



పెదపూడిలో గంగానమ్మకు నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

మొవ్వ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగానమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య ఘటం ఊరేగింపులు, నైవేద్యాలు, మొక్కుబడులను పండుగ వాతావరణంలో తీర్చుకున్నారు. పెదపూడిలోని గంగానమ్మ వద్ద భక్తులు వందల సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు బడులుతీర్చుకున్నారు. మొవ్వ గ్రామంలో, కొండవరం గ్రామాల్లోని గంగానమ్మ ఆలయాల వద్ద వేడుకలు జరిగాయి.

ముగిసిన జాతర

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో గంగానమ్మ జాతర ఘనంగా ముగిసింది. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యాన మూడు రోజులుగా జరుగుతున్న గంగానమ్మ జాతరతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తొలిరోజు శుక్రవారం మానుపూజ, రెండోరోజు శనివారం పోతురాజుగెడ ఊరేగింపు, మూడో రోజు ఆదివారం మొక్కుబడుల చెల్లింపుతో అమ్మవారి జాతర ముగిసింది. కార్యక్రమాలను యాదవ సంఘం ప్రతినిధులు పర్యవేక్షించారు.



మండవల్లిలో గంగనమ్మ జాతర

మండవల్లి: మండవల్లిలో గంగానమ్మ జాతర కార్యక్రమాన్ని కాపు కులస్తులు ఆదివారం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుర వీధుల్లో డప్పు వాయిద్యాలతో ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి కొబ్బరికాయ, బియ్యం సమర్పించారు. గంగానమ్మ సోదరుడు పోతురాజుగా పెడవల పాండురంగారావు ఆకట్టుకున్నారు. ఏ కష్టం లేకుండా సంతోషంగా ఉండేవిధంగా ఆశీర్వదించాలని మహిళలు అమ్మవారిని కోరుకున్నారు. అడపా జానీ, గనిశెట్టి శ్రీరామ్, బోగాధి సతీష్, గుడివాడ దిలీప్, చెలమలశెట్టి ప్రసాద్, అచ్యుత శివ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం.. ఆనందమయం



తాడంకి హైస్కూల్‌లో గురువులతో 1972-73 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

తాడంకి పాఠశాలలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు

పమిడిముక్కల: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ పూర్వ విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. తాడంకి హైస్కూల్‌లో ఆదివారం ఆ పాఠశాల 1972–73 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. గోల్డెన్‌జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. 50 సంవత్సరాల కితం చదువుకొన్న విద్యార్థులు 65 సంవత్సరాల వయస్సులో కలుసుకున్నారు. చదువుకొనే రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకొన్నారు. పాఠశాల ఆవరణంతా కలియతిరిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా..ఉల్లాసంగా గడిపారు. తమకు పాఠాలు చెప్పిన ఆనాటి గురువులను సత్కరించారు. హైస్కూల్ అభివృద్ధికి సహకరించాలని నిర్ణయం తీసుకొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన ఈడే శ్యామల రేఖకు రూ.15వేలు, ద్వితీయ స్థానం సాధించిన జలసూత్రం హేమకు రూ.10 వేలు, తృతీయ స్థానం పొందిన యశ్వంత్‌కు రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, హెచ్ఎం ప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంభపు రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు యేనుగ మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా



మృతుని భార్యకు బీమా క్లయిమ్ అందజేస్తున్న నాయకులు

పామర్రు: స్థానిక ఎంపీటీసీ ఐదో సెగ్మెంట్ పరిధి 20వ వార్డు బాపూజీపేటలో ఇటీవల వీరంకి వీరబాబు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ బీమా నగదు రూ.లక్షను ఆదివారం అందజేశారు. పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మొత్తం రూ.లక్షను నామినీ అయిన మృతుని భార్య విజయలక్ష్మికి స్థానిక ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, ఆర్‌బీకే మండల అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.